నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 27 జూన్ 2024 | RANGAREDDY




## గత ప్రభుత్వ లక్ష్యం..
# నేడు సాకారం

- షాద్‌నగర్‌లో పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభానికి సిద్ధం
- గత ఏడాది కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే మంజూరు
- అధ్యాపకుల నియామకం పూర్తి.. ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామకానికి చర్యలు
- జిల్లాలో నాలుగుకు చేరిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు

రంగారెడ్డి, జూన్ 26(నమస్తే తెలంగాణ) : షాద్‌నగర్‌లో పాలిటెక్నిక్ కళాశాల అందుబాటులోకి వచ్చింది. కళాశాల నిర్వహణకు సాంకేతిక విద్యాశాఖ అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం ప్రవేశాలకు కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. అధ్యాపకుల నియామకం సైతం పూర్తయింది. ఈ ఏడాది జూలై 17 నుంచి తరగతులను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గత ఏడాది బీఆర్ఎస్ ప్రభుత్వం కళాశాలను మంజూరు చేయగా.. దీని వెనుక అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కృషి ఉన్నది. కళాశాల నిర్మాణానికి అప్పట్లోనే ప్రభుత్వం రూ.16.49కోట్ల నిధులను సైతం మంజూరు చేసింది. యువతకు వృత్తి నైపుణ్యం కల్పించేందుకు కేసీఆర్ సంకల్పంతో షాద్ నగర్‌లో ఏర్పాటైన పాలిటెక్నిక్ కళాశాల ఇక్కడి యువతకు వరంగా మారనున్నది.

### మూడు కోర్సులతో ప్రారంభం..

పాలిటెక్నిక్ కళాశాలకు పక్కా భవనం లేకపోవడంతో తాత్కాలికంగా షాద్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతులను మొదలు పెడుతున్నారు. మొదటి సంవత్సరానికి సంబంధించి డిప్లొమా ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ తరగతులను మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మూడు డిప్లొమా కోర్సుల్లో ప్రతి కోర్సుకు 60 సీట్ల చొప్పున 180 సీట్లను భర్తీ చేయనున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ బిట్ల వేణును ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతానికి 10 మంది టీచింగ్ స్టాఫ్‌ను ప్రభుత్వం నియమించింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామక ప్రక్రియను సైతం చేపడుతున్నారు. ప్రస్తుతం కౌన్సిలింగ్ ప్రక్రియ కొనసాగుతుండగా.. జూలై 13 నాటికి విద్యార్థులు కళాశాలలో రిపోర్టు చేయనున్నారు. జూలై 17 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు అబ్దుల్లాపూర్‌మెట్, బడంగ్‌పేట్, మహేశ్వరంలలో ఉండగా.. షాద్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటైన కళాశాలతో జిల్లాలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల సంఖ్య నాలుగుకు చేరింది.

### విద్యార్థులకు వరం..

షాద్‌నగర్‌లో అందుబాటులోకి వచ్చిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిరుపేదల విద్యార్థులకు వరంగా మారనున్నది. ఈ ప్రాంతంలో సాంకేతిక విద్య అందుబాటులో లేక నిరుపేద విద్యార్థులు చదువుకు దూరం కావాల్సి వస్తున్నది. పదో తరగతి ఉత్తీర్ణులైన తర్వాత పాలిసెట్ ఎంట్రన్స్‌లో క్వాలిఫై అయిన విద్యార్థులు సుదూరంగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలకు లేదంటే హైదరాబాద్‌కు వెళ్లి చదువుకోవాల్సి వస్తున్నది. ఫలితంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. జిల్లాలో గత ఏడెనిమిదేండ్లుగా పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ఈ క్రమంలో వృత్తి నైపుణ్య కోర్సులను పూర్తి చేసిన వారికి మంచి డిమాండ్ ఉన్నది. ప్రస్తుతం అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతోద్యోగాలు పొందేందుకు ఇక్కడి యువత ఉవ్విళ్లూరుతున్నది.

#### ఆప్షన్ పెట్టుకోవచ్చు..

షాద్ నగర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ సంవత్సరం నుంచి మొదటి సంవత్సరానికి సంబంధించిన తరగతులు ప్రారంభం అవుతున్నాయి. 10వ తరగతి ఉత్తీర్ణులై, పాలీసెట్–2024లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అప్షన్ పెట్టుకోవచ్చు. వివరాలకు 7660912646ను సంప్రదించాలి.

– బిట్ల వేణు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

## నగదు వద్దు.. భూమికి, భూమి ఇవ్వండి..
# లేదా పరిహారం పెంచండి

**మెడికల్ కళాశాల కోసం భూసేకరణలో కొడంగల్‌లో రైతుల అభిప్రాయ సేకరణ**



తహసీల్దార్ కార్యాలయంలో రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్న అధికారులు

కొడంగల్, జూన్ 26 : అభివృద్ధి పనులను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించి ముందుకు రావాలని కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అప్పాయిపల్లి గ్రామ సర్వే నం.19కి సంబంధించిన రైతులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల ఏర్పాటుకు గాను భూ సేకరణ నిమిత్తం రైతులతో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సర్వే నం.19లోని రైతులకు ప్రభుత్వం ఎటువంటి అన్యాయం తలపెట్టదని, ఎకరాకు రూ.10లక్షలతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కేటాయించే దిశగా ప్రభుత్వం యోచిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇదివరకే 23 మందికి సంబంధించి 33 ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చేందుకు రైతులు ఒప్పుకున్నారన్నారు. మిగతా రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు స్థానికంగా మెడికల్ కళాశాల ఏర్పాటుతో మీ ప్రాంతం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఇందుకు రైతులు మాట్లాడుతూ ఎకరాకు రూ.10లక్షలు ఇవ్వడం వల్ల రైతులు మరో చోట భూమిని కొనలేని పరిస్థితి ఉన్నదని, భూమిని తీసుకొని మరో చోట భూమిని కేటాయిస్తే రైతులమంతా సంతోషిస్తామని పేర్కొన్నారు. లేదంటే ఇచ్చే పారితోషికాన్ని ప్రభుత్వం పెంచితే కొంత వరకు ఆలోచిస్తామని, ప్రభుత్వం రైతులను కాపాడే దిశగా కృషి చేస్తే మేలు చేకూరుతుందని రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, సర్వే నం.19కి సంబంధించిన రైతులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

వికారాబాద్,జూన్ 26 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న స్పోర్ట్స్ స్కూళ్లలో (హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్) 4వ తరగతిలో ప్రవేశాల కోసం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో బాలబాలికల ఎంపికలకు సంబంధించిన పోస్టర్‌ను వికారాబాద్ జిల్లాలో ఉండే బాల బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి హనుమంత రావు, డీపీఆర్వో చెన్నమ్మ, మత్స్య శాఖ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.





# చేతల బీఆర్ఎస్
# 'కోత'ల కాంగ్రెస్

**కేసీఆర్ హయాంలో పవర్ ఫుల్.. కాంగ్రెస్ పాలనలో కోతలు ఫుల్**

- పంటల సాగుకు తప్పని తిప్పలు..
- అన్నదాతలు ఆగమాగం
- హస్తం పార్టీ తీరుతో మళ్లీ అప్పులపాలవుతున్నామంటూ ఆవేదన
- కక్షపూరితంగానే కేసీఆర్‌ను బద్నాం చేస్తుండ్రని మండిపడుతున్న రైతాంగం

బీఆర్ఎస్ పాలనలో 24 గంటలూ నాణ్యమైన ఉచిత విద్యుత్తు, సకాలంలో పెట్టుబడి సాయం అందించడంతో రైతులు పంటల సాగును పండుగలా చేసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. అంతేకాదు ఇప్పటికీ పెట్టుబడి సాయం ఊసేలేదు. దీంతో సాగుకు డబ్బులు లేక, నిరంతర కరెంట్ లేక రైతులు నరకయాతన పడుతున్నారు. ఎడాపెడా కోతలు విధిస్తుండడంతో రైతులు పొలాల వద్ద విద్యుత్తు కోసం రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. ఈ పరిస్థితి స్వరాష్ట్రానికి ముందు కాంగ్రెస్ హయాంలో ఉన్నది. తెలంగాణ వచ్చినంక కేసీఆర్ ప్రత్యేక చొరవతో విద్యుత్ కొరతను అధిగమించి వ్యవసాయానికి నిరంతర నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేశారు. పదేండ్ల పాటు ఏ లోటూ లేకుండా వ్యవసాయం చేసుకున్న రైతులు.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌లో మళ్లీ అనాటి అవస్థలు పడుతున్నారు. నాణ్యత లేని విద్యుత్తుతో కొన్ని చోట్ల మోటర్లు కాలిపోతున్నాయి. ఇది అన్నదాతలకు అదనపు భారంగా మారుతున్నది. 'కేసీఆర్ పాలనలోనే అన్ని వసతులు ఉండే.. ఏ రంది లేకుండా ఏడాది మూడు పంటలు సాగు చేసేటోళ్లం.. కాంగ్రెస్ అసమర్థత పాలన మళ్లీ కష్టాల పాలు చేసింది. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియన కరెంట్‌తో కంటిమీద కునుకు లేకుండా జాగారం చేయాల్సి వస్తుంది' అని పలువురు రైతులు వాపోతున్నారు.



#### రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి. సమయానికి పెట్టుబడి సాయం అందించాలి. నిరంతర కరెంట్ ఇవ్వాలి. కక్షపూరిత పోకడలు మానుకొని రైతులకు మేలు చేయాలి.

– శంకర్, రైతు నందిగామ



#### గతంలో కరెంట్ ఇబ్బందులు లేవు..

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో విద్యుత్ కోతలకు తావుండేది కాదు. రెప్పపాటున కూడా కరెంట్ సరఫరా నిలిచి పోకుండా గత ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. అసత్య ప్రచారాలలు, సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి చీటికిమాటికి కరెంట్ కోతలు విధిస్తున్నది. గతంలో లేని ఇబ్బందులు ఇప్పుడెందుకొస్తున్నాయో అర్థం కావడం లేదు.

– వీరాంజనేయులు, అంతారం గ్రామం, చేవెళ్ల మండలం



#### అస్తమానం విద్యుత్తు కోతలు..

హస్తం పార్టీ అధికారంలోకి వచ్చినంక అస్తమానం విద్యుత్ కోతలు విధిస్తున్నది. ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెల్వని పరిస్థితి. గత కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటలు కరెంట్ సరఫరా ఉండేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం కరెంట్ పోకడనే ఉన్నది.. కాని వచ్చుడు లేదు. గంటల తరబడి సరఫరా నిలిచిపోతున్నది.

– నవీన్, అంతారం గ్రామం, చేవెళ్ల మండలం



#### బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం బాగుపడ్డది...

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయరంగం బాగుపడ్డది. 24 గంటలు కరెంట్ సరఫరా చేయడంతో, అవసరమైనప్పుడు పొలం పారబెట్టుకునే వాళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక కోతలు మొదలయ్యాయి. వ్యవసాయానికి కరెంట్ ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియకుండా ఉంది. కరెంట్ వచ్చిన వెంటనే రైతులందరూ ఒకేసారి మోటర్లు ఆన్ చేస్తే మోటర్లు కాలిపోయే పరిస్థితికి వచ్చింది.

– శ్రీనునాయక్, రైతు, కడ్తాల్ మండలం



#### ఆనాటి రోజులు గుర్తుకొస్తున్నాయి..

కరెంట్ విషయంలో రాష్ట్రం రాక ముందు రోజులు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. కేసీఆర్ పదేండ్ల పాలనలో రైతులకు ఏ లోటూ రానివ్వలేదు. కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేసీఆర్‌ను ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నది. ఆయన వల్లనే నిరంతర ఉచిత కరెంట్ అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలుస్తలేదు. షాబాద్ మండలం నాగరగూడలో మా బంధువు రాత్రి పూట చేనుకు నీళ్లు పెట్టడానికి వెళ్లినప్పుడు పాము కాటు వేసింది. దానిని తలుచుకుంటే తెలంగాణ రాష్ట్రం రాక ముందు పాత రోజులు గుర్తుకొస్తున్నాయి. గత ప్రభుత్వం ఇచ్చినట్లుగా కరెంటు రైతులకు నాణ్యమైన కరెంట్ ఇస్తే బాగుంటుంది.

–బొర్ర భిక్షపతి, రైతు, సురంగల్, మొయినాబాద్

#### కాంగ్రెస్ రైతు వ్యతిరేకి..



కాంగ్రెస్ అంటేనే రైతు వ్యతిరేకి అని మరోసారి నిరూపితమైంది. ఉమ్మడి రాష్ట్రంలో రైతులకు చుక్కలు చూపించిన కాంగ్రెస్ ప్రస్తుతం మళ్లీ అన్నదాతలను ఆగం చేస్తున్నది. సరిపడా కరెంట్ లేక, పెట్టుబడి సాయం అందక రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో సకల సౌకర్యాలతో రైతులు దర్జాగా పంటలు సాగు చేసుకుంటే.. కాంగ్రెస్ పాలనలో రైతులు కూలీలుగా మారిపోయారు. కేసీఆర్ 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్తును అందిస్తే.. 8 గంటల కోతలు కరెంట్‌తో కాంగ్రెస్ కష్టాలు పెడుతున్నది.

–చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణపూర్, యాలాల మండలం

#### వైఫల్యాలకు నిదర్శనం కాంగ్రెస్



తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కరెంటు కష్టాలను రైతులు మరచిపోయారు. మళ్లీ ఆ కష్టాలను కాంగ్రెస్ గుర్తు చేస్తున్నది. కేసీఆర్ కృషితోనే విదుత్తు సమస్య తొలగిపోయింది. కాంగ్రెస్ రాకతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. కేసీఆర్ వ్యవసాయాన్ని పండుగ చేస్తే.. కాంగ్రెస్ తన చేతగాని పాలనతో దండుగలా మార్చింది. కాంగ్రెస్ ఇకనైనా కక్షపూరిత ధోరణిని మార్చుకొని రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి.

–రాములు, దౌలాపూర్, యాలాల మండలం



# రైతన్నల తండ్లాట



బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్లలో పైపులైన్ ద్వారా తుంపర్లతో పంటను కాపాడుకుంటున్న రైతు

తొలకరి జల్లులకు విత్తనాలు విత్తుకుని సంబురపడ్డ రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అధిక వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటనలతో ఈ ఏడాది పంటలు గట్టెక్కుతాయన్న మురిసిన అన్నదాతల ఆనందం ఆవిరైపోయింది. ఇటు రాష్ట్ర సర్కార్ నిరంతర విద్యుత్తు సరఫరా చేయదూ.. అటు వరుణులు కరుణించదూ.. చేసేదేమి లేక వేసిన మొలకెత్తిన మొలకలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. వికారాబాద్ మండలం నారాయణపూర్‌లో ఓ రైతు మందుడబ్బాతో పత్తి మొక్కలకు నీళ్లు పడుతున్నారు. బొంరాస్‌పేట మండలంలోని తుంకిమెట్ల, రేగడిమైలారం గ్రామాల్లో తుంపర్ల పైపుల ద్వారా పంటలు ఎండిపోకుండా నీటి తడిని అందిస్తుండడం 'నమస్తే తెలంగాణ' కంటపడింది.

- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



వికారాబాద్ మండలంలోని నారాయణపూర్‌లో మందుడబ్బాతో నీళ్లు పడుతున్న రైతు